# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 17-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:13 పేజీలు:6 వెల: రూ.1/-


## కొండ పైనుంచి దొర్లుకుంటూ వచ్చి ఢీకొట్టిన గుండు.. కేదార్‌నాథ్ యాత్రికుడి దుర్మరణం

న్యూఢిల్లీ, ఆగష్టు 16:ఉత్తరాఖండ్ లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కేదార్‌నాథ్ ధామ్ కేదార్‌గాటి రీజియన్‌లలో ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండటంతో మందాకినీ నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో కేదార్‌నాథ్ మార్గంలో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి.లఃమహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్తున్న ఓ 38 ఏళ్ల భక్తుడు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. గౌరీకుండ్ సమీపంలోని ఓ కొండ పైనుంచి గుండు దొర్లుకుంటూ వచ్చి యాత్రికుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.విరిగిపడుతుండటం లాంటి పరిణామాల నేపథ్యంలో కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు.

## చురక

భారత్ చైనా సంబంధం
బలపడగలదా ఇకపైనా
సమస్యలన్ని ఏవేవైనా
సమసిపోవునా ఇకనైనా
వాణిజ్య యుద్ధాలేవైనా
విడదీస్తయ్ కలిపేస్తయ్
శత్రులను మిత్రులుగా
చేర్చేస్తయ్ మార్చేస్తయ్



-వేల్పుల నారాయణ
9440433475

### ఖజానా జ్యువెలరీ చోరీ కేసులో నిందితులు అరెస్టు..

# 10 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం



హైదరాబాద్, ఆగష్టు 16: చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ దుకాణంలో పట్టపగలే దోపిడీ దొంగలు చోరీకి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దోపిడీకి పాల్పడ్డ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ చోరీ కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియాకు వెల్లడించారు.

ఖజానా జ్యువెలరీ దుకాణంలో చోరీకి పాల్పడ్డ నిందితులంతా బీహార్‌కు చెందిన వారేనని తెలిపారు. గత రెండేండ్లుగా వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. ఇక ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీల బాట పట్టారు. ఇందుకు చందానగర్ ఖజానా జ్యువెలరీ దుకాణం వద్ద 20 రోజుల పాటు రెక్కీ నిర్వహించి, చోరీకి పాల్పడ్డారు. నిందితులు ఏడుగురు కూడా బైక్‌పై వచ్చి బైక్‌లపైనే పారిపోయారని తెలిపారు.

10 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులను దొంగలు అపహరించారు. బంగారంగా భావించి బంగారం పూత పూసిన వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ బిహార్ ముఠా హైదరాబాద్‌లో చేసిన తొలి చోరీ ఇది. గతంలో కోల్‌కతా, బిహార్, కర్ణాటకలో దోపిడీలకు పాల్పడినట్లు గుర్తించామని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు.

## నాగాలాండ్ గవర్నర్ శ్రీ లా గణేషన్ మరణం పార్టీ కి తీరని లోటు

**– బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు**

హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నాగాలాండ్ గవర్నర్ శ్రీ లా గణేషన్ మరణం పార్టీ కి తీరని లోటు అని

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు పేర్కొన్నారు.. శ్రీ లా గణేషన్ అనారోగ్యంతో మరణించారన్న వార్త తీవ్రంగా బాధించిందనన్నారు.వారు భారతీయ జనతా పార్టీ లో అనేక బాధ్యతలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులుగా, తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా, భారతీయ జనతా పార్టీ జాతీయ స్థాయిలో అనేక బాధ్యతలను నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర పార్టీ ఇన్చార్జిగా వ్యవహరించి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి. జాతీయ భావం తో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో సేవలందించినారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు వారితో కలిసి పార్టీ అభ్యున్నతికి పనిచేశారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఉత్సాహాన్ని కల్పించేవారు. తన జీవితకాలం పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి. శ్రీ లా గణేషన్ మరణం పట్ల ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తన సంతాప సందేశం లో పేర్కొన్నారు.

# వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలి

**-ఎన్ డిఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలి**

**-ఎప్పటికప్పుడు జలాశయాలను అధికారులు పరిశీలిస్తూ ఉండాలి**

**-భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉంచాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్ డిఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో సిఎం మాట్లాడారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలని రేవంత్ తెలియజేశారు.ర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, నగర, పురపాలక, గ్రామాల పరిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు తగినన్ని ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికా రులతో చెప్పారు. హైదరాబాద్ లో ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను వెంటనే పరి ష్కరించాలని, జిహెచ్ఎంసి, హైడ్రా, ఎస్డిఆర్ఎఫ్, అగ్ని మాపకశాఖ తక్షణ మే స్పందించాలని రేవంత్ రెడ్డి కోరారు.

# ముగిసిన డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ భేటీ

**-అమెరికా గడ్డపై అడుగుపెట్టిన రష్యా అధినేతకు 'హీరో' లెవెల్లో స్వాగతం**

**-పుతిన్‌తో భేటీ వేళ తన సైనిక సత్తా ప్రదర్శించిన ట్రంప్**




న్యూ డిల్లీ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ భేటీ ముగిసింది. అలస్కా వేదికగా జరిగిన ఈ సమావేశం ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే దిశగా ఉంటుందని అంతా భావించారు. అయితే, ఎలాంటి ఒప్పందం లేకుండానే ఇద్దరి మధ్య చర్చలు ముగిశాయి. ఇక ఈ భేటీ సందర్భంగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాదాపు సంవత్సరాల తర్వాత అమెరికా గడ్డపై అడుగుపెట్టిన రష్యా అధినేతకు 'హీరో' లెవెల్లో స్వాగతం లభించింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని పుతిన్ ఆపకపోతే అత్యంత తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ ఇటీవలే తీవ్ర హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. అయితే, తాజా భేటీలో ట్రంప్ వైఖరి పూర్తిగా మారిపోయింది. భేటీకి రెండు రోజులు తీవ్రస్వరంతో బెదిరించిన అమెరికా అధ్యక్షుడు.. పుతిన్‌ను చూడగానే ఆప్యాయంగా పలకరించారు. రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారు. ఈ పర్యటన వేళ పుతిన్‌కు దాదాపు నాలుగు యూఎస్ ఫైటర్ జెట్‌లతో స్వాగతం లభించింది. రష్యా అధ్యక్షుడికి ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి చిరునవ్వుతో పలకరించారు. ఇద్దరూ చాలా ఆత్మీయంగా కన్పించారు. ఇక ట్రంప్‌తో కలిసి 'బీస్ట్' వాహనంలో పుతిన్ ప్రయాణించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇద్దరూ బీస్ట్‌లో వెనుక సీట్లో కూర్చుని సమావేశ వేదిక వద్దకు వెళ్లారు. 10 నిమిషాల ఈ ప్రయాణంలో ట్రంప్ మాట్లాడుతుండగా పుతిన్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు.

### సైనిక సత్తా ప్రదర్శించిన ట్రంప్

మరోవైపు పుతిన్‌తో భేటీ వేళ ట్రంప్ తన సైనిక సత్తా ప్రదర్శించారు. ఈ భేటీకి ముందు అలాస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్‌సన్ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్ చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటి పుతిన్ అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పుతిన్‌కు ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. అయితే, పుతిన్‌ను చిరునవ్వుతో పలకరించిన ట్రంప్.. అదే సందర్భంలో తన 'పవర్ ప్లే' చూపించారు. ట్రంప్, పుతిన్ పోడియం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా.. వారిపైనుంచి బీ-2 బాంబర్లు దూసుకెళ్లాయి. అంతేకాదు, వీరు వెళ్తున్న మార్గంలో యుద్ధ విమానాలను వరుసగా పార్క్ చేసి ఉంచారు. ఇది చూసి పుతిన్ ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలను చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు పుతిన్‌కు ట్రంప్ అమెరికా సైనిక సత్తాను పరోక్షంగా చూపించారు అంటూ మాట్లాడుకుంటున్నారు. కాగా, ఇటీవలే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం సందర్భంగా టెహ్రాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా ఈ బీ-2 బాంబర్లను ఉపయోగించిన విషయం సంగతి తెలిసిందే.

### చషోటి గ్రామాన్ని సందర్శించిన జమ్ము కశ్మీర్ సీఎం..

# బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటన



న్యూఢిల్లీ, ఆగష్టు 16:జమ్ము కశ్మీరులోని కిష్టార్ జిల్లాలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 60 మందికిపైగా మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో గురువారం వచ్చిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా చషోటి గ్రామాన్ని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు.

మరోవైపు బాధిత కుటుంబాలకు జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. విపత్తులో మరణించిన కుటుంబాలకు రూ. 2లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపింది. ఇక ఈ ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.50 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ.25 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల్లోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు:రెండు రోజుల్లోనే 321 మంది

న్యూ డిల్లీ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )(;పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ల్లోని పలు ప్రాంతాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్టు అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోనే 307 మంది చనిపోయినట్టు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని లోయర్ దిర్, బజౌర్, లబోటాబాద్,జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగి పడటంతో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు,పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతు కాగా, వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2 వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు పాక్ లోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్షముప్పు ఉన్నట్టు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

## హరే కృష్ణ నామంతో మారుమ్రోగిన ఇస్కాన్ మందిర ప్రాంగణం



హైదరాబాద్, ఆగష్టు 16:శ్రీ కృష్ణుడి 5252వ జన్మదినం సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి పుణ్య పర్వదినం సందర్భంగా కరీంనగర్ ఇస్కాన్ మందిరంలో అత్యం భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకులు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. చిన్ని కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, భజనలు, సంకీర్తనలు, ప్రవచనాలు, కృష్ణతత్వ బోధనలు, జీవితాలకు అన్వయిస్తూ భగవద్గీత వివరణలు, మహా హారతి, మహా ప్రసాద వితరణలతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు జన్మాష్టమి వేడుకలు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తుల హృదయాలను దోచుకున్నాయి. ఆలయ ప్రధాన పూజారి శ్రీమాన్ నరహరి ప్రభుజీ నేతృత్వంలో నిర్వహించిన వేడుకలకు 500లకు పైగా భక్తులు హాజరై కృష్ణ నామ జపం చేస్తూ, స్వచ్ఛందంగా భక్తిసాగరంలో మునిగి పోయారు. ఈ కార్యక్రమంలో కన్న కృష్ణ, డా: రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, పోరెడ్డి శ్రీహరి రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డిలతో పాటు ఇస్కాన్ నిర్వాహక సిబ్బంది వందల కొద్ది భక్తులు పాల్గొన్నారు.

## రోడ్ల డ్యామేజీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, ఆగష్టు 16:భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 629 కిలో మీటర్ల రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు.

భారీ వర్షాల కారణంగా 22 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 4 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్లు మంత్రి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. 171 చోట్లలో ఇంకా కాజ్ వే, కల్వర్టులు వద్ద వరద ప్రవాహం ఉన్నట్లు పేర్కొన్నారు. 108 రాకపోకలకు ఇబ్బంది ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. 71 చోట్ల క్లియర్ చేయగా.. మిగతా చోట్ల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. వాగుల వెంట 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్లు రోడ్డును ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. మొత్తంగా 147 చోట్లలో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప రావొద్దని మంత్రి సూచించారు.

# మానవాళికి శ్రీకృష్ణతత్వం మార్గదర్శకం -డాక్టర్ కెవి రమణ చారి



హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పరమాత్మగా కీర్తింపబడే శ్రీకృష్ణుడు మూర్తి అని శ్రీకృష్ణుడు మానవాళికి భవద్గీతను ప్రసాదించిన ప్రేమ మూర్తి అని శ్రీకృష్ణతత్వం అందరికీ మార్గదర్శకం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణ చారి అన్నారు త్రిమూర్తుల గౌరీ శంకరు కుటుంబీకులు నెలకొల్పిన చిక్కడపల్లి శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజుల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను డాక్టర్ కె.వి రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. అనంతరం పూజలు చేసి భోపాలుడికి కంకర్యాలు సమర్పించారు ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ ప్రతి ఏటా త్రిమూర్తుల గౌరీ శంకరం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ధార్మిక రీతిలో సంగీత కృత్య ప్రసంగా కార్యక్రమాలతో తరిస్తూ కొనసాగిస్తూ ఉన్నారని అభినందించారు అలాగే శ్రీకృష్ణ మందిరం మరింత విశాలంగా సౌకర్యంగా ఉండేందుకు తగు సూచనలు చేసి గౌరీ దంపతులను గౌరీ శంకర్ దంపతులను ఆశీర్వదించారు ఉత్సవాలలో ముఖ్యంగా జయ వెంకటేష్ బృందం చే వేదపట్టణం సూర్య కుమార్ బృందం కి విష్ణు లలిత సహస్ర పారాయణం జరిగాయి గీతారెడ్డి శ్రీ సంయుక్త బృందం చే భక్తి సంగీత ప్రజ్ఞ కళా సమితి వారికి మల్లాది విజయలక్ష్మి బృందం భజన కీర్తనలు జరిగాయి అతిథులుగా చేసిన రమణాచారి కె.వి.కృష్ణకుమారి కమలాకర భారతి లతో పాటు ఎలాకాలను కృష్ణ మందిరం రక్షణ ధర్మకర్తలు త్రిమూర్తుల గౌరీ శంకర్ దంపతులు ఘనంగా సత్కరించి ప్రసాద వితరణ కావించారు

## మల్లెకేడి రాములుకు రాష్ట్ర స్థాయి పురస్కారం



హైదరాబాద్, ఆగష్టు 16:సికింద్రాబాద్ రీజన్ కంటోన్మెంట్ డిపోకు చెందిన డ్రైవర్ మల్లెకేడి రాములు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బస్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. డ్రైవర్ గా తన విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ నే,మహాకవి సి.నారాయణ రెడ్డి పేరిట మహాకవి సినారె కళాపీఠం ఏర్పాటు చేసి ప్రతీ ఏటా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సాహిత్య పురస్కారాలు అందజేస్తున్నారు..తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం ఆర్థిక సహకారం అందిస్తూ వస్తున్నారు.వృత్తి తో పాటు సాహిత్య కళా సామాజిక రంగాలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం జరిగింది. రాములు రాష్ట్ర పురస్కారం అందుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## మరికాసేపట్లో భారీ వర్షం.. బయటకు రావొద్దన్న అధికారులు

హైదరాబాద్, ఆగష్టు 16:భాగ్య నగరంలో మరోసారి భారీ వర్షం కురవనుంది. వరుణుడు మరోసారి నగర వాసులపై కనికరం లేని ప్రతాపం చూపాడానికి సిద్ధమైనట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రానున్న 2-3 గంటల్లో నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. ఈ మేరకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. పనులు ముగించుకుని త్వరగా ఇంటి ముఖం పట్టాలని సూచిస్తుంది.తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు జనసంచారం స్థంభించిపోయింది. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అని తేడా లేకుండా.. అన్ని ఫ్లోటింగ్ సిటీలుగా మారిపోయాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై రాకపోకలు లేక రోడ్లన్ని వెలవెలబోతున్నాయి. అయితే.. తాజాగా భారత వాతావరణ శాఖ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రానున్న 2-3 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# ఇస్కాన్ వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాద జయంతి

## (17 ఆగష్టు ఇస్కాన్ వ్యవస్థాపకులు "ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద జన్మదినం" సందర్భంగా)

దైవ సమానులు, మానవుల్లో మాధవ సమానుడు "అభయ్ చరణ్ డె భక్తివేదాంత స్వామి ప్రభుపాద" (1896 – 1977) వారు కృష్ణాష్టమి తదుపరి రోజున నందోత్సవం శుభ గడియల్లో 01 సెప్టెంబర్ 1996న కలకత్తాలో జన్మించారు. గౌడీయా వైష్ణవ కుటుంబంలో వస్త్ర వ్యాపారి అయిన తండ్రి గౌర్ మోహన్ డె, తల్లి రంజని దంపతులకు జన్మించిన అభయ్ చరణ్ డె, చిన్నతనం నుంచే అత్యంత భక్తిశ్రద్ధలతో భగవాన్ కృష్ణుడి భక్తి సాగరంలో మునిగి పోయారు. బిడ్డ పుట్టగానే తల్లిదండ్రులు జన్మ దినం ఆధారంగా జాతకం చూపించగా, అభయ్ చరణ్ ఎదిగిన తర్వాత మహాసముద్రాలు దాటి ప్రపంచాన్ని చుట్టి, హైందవాన్ని ప్రచారం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా 108 కృష్ణ మందిరాలు (ఇస్కాన్ టెంపుల్స్) నెలకొల్పడానికి కారణం అవుతాడని తెలపడం జరిగింది. ఇంతటి మహానుభావుడి జన్మదినాన్ని కృష్ణాష్టమి తదుపరి 17 ఆగష్టు 2025 రోజున "శ్రీల ప్రభుపాదులు కనిపించిన లేదా జన్మించిన దినం (శ్రీల ప్రభుపాద అపియరెన్స్ డే)"గా పాటించడం జరుగుతున్నది. ఇదే రోజున "వ్యాస పూజ" దినంగా కూడా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

### "అభయ్ చరణ్ డె" జీవిత చరిత్ర:

అభయ్ చరణ్ డె అనే పేరుతో 01 సెప్టెంబర్ 1996 పుణ్య గడియల్లో కృష్ణాష్టమి తరువాత రోజున నందనోత్సవం జరుపుకుంటున్న వేళ జన్మించారు. చిన్ననాటి నుంచే భక్తిని ఒంటపట్టించుకున్నారు. పాఠశాల విద్య అనంతరం 1920లో కలకత్తా స్కాటిష్ చర్చ్ కాలేజీలో బి.ఏ. (ఇంగ్లీష్, ఫిలాసఫీ, ఎకనమిక్స్) డిగ్రీ పూర్తి చేసినప్పటికీ పరమ దేశభక్తుడిగా బ్రిటీష్ పాలకుల నుంచి పట్టా తీసుకోవడాన్ని తిరస్కరించారు. మహాత్మాగాంధీ చేపట్టిన సహాయనిరాకరణ ఉద్యమంలో క్రియాశీలంగా ఉద్యమించారు. 1922లో శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతి ఠాకూర్ అనబడే గురువు పంచన చేరి 1933లో పూర్తి శిష్యులుగా మారారు. నాటి నుంచే భక్తి వేదాంతం, భగవద్గీత సంబంధ రచనలు చేస్తూ, పలు ప్రఖ్యాత భక్తి ఇతివృత్త పుస్తకాలను రచించారు. తన రచనల్లో ప్రముఖమైనదిగా "బ్యాక్ టు గాడ్‌హెడ్" అనే మ్యాగజీన్‌ను 1944లో తీసుకువచ్చారు. తన గురువు మార్గదర్శకం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా దేశాల్లో కృష్ణ చైతన్య సూత్రంగా కార్యక్రమాలు నిర్వహించమని ఆదేశించగా, తన 69వ ఏట 1965లో వస్తు రవాణా చేసే పడవలో అమెరికా చేరారు. పాశ్చాత్య దేశాల్లో వాడవాడల్లో తిరుగుతూ, 1966లో ఇస్కాన్ సంస్థను స్థాపించి, పబ్లిక్ గార్డెన్లలో కృష్ణ చైతన్యంతో పాటు సరళ రీతిలో భగవద్గీతను బోధిస్తూ, అనతి కాలంలోనే పాశ్చాత్య జాతికి చెందిన భక్తులను ఏకం చేయగలిగారు. తన జీవితకాలంలో 11 ఏండ్లలో 14 సార్లు విదేశాలు సందర్శించి కృష్ణ చైతన్యం కలిగించడంతో కృతకృత్యులయ్యారు. నేడు ఇస్కాన్ గొడుగు కింద 108 దివ్య కృష్ణ మందిరాలు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, పౌర సమాజ చైతన్య కేంద్రాలు నిర్వహించే స్థాయికి తీసుకువచ్చారు. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు తన 81వ ఏట 14 నవంబర్ 1977 రోజున తుది శ్వాస విడిచారు.

### కృష్ణ చైతన్య ఉద్యమ కర్త – ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద :

ప్రభుపాదుల స్వామి జన్మదినం రోజున ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న "అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం లేదా ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ కృష్ణ కాన్సియస్‌నెస్)" మందిరాల్లో కృష్ణ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటిగా మారింది. ఆధ్యాత్మిక ప్రవచనకర్త, మేధావి, గురువు, కృష్ణ తత్వ బోధకులు, సరళ భాషలో భగవద్గీత ప్రచారం చేయగల బోధకులు అయిన ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద జీవితం ఆసాంతం అద్భుతాల మయం, అనుసరణీయం.

ఇస్కాన్ వ్యవస్థాపకులుగా మానవాళికి జీవన మార్గాలను బోధిస్తూ తన అద్భుత ప్రతిభతో అంతర్జాతీయ కృష్ణ భక్తులను ఏకం చేస్తూ, కృష్ణ తత్వాలను ప్రచారం చేయగలిగారు. మాంసాహారం, జూదం లేదా గ్యాంబ్లింగ్, మత్తు పదార్థాలు, అక్రమ సంబంధాలకు దూరంగా ఉండాలని బహుళ ప్రచారం నిర్వహించారు. నిరాడంబరత, పరిశుభ్రత, సత్యసంధత, కరుణ అనబడే నాలుగు సద్గుణాలు మాత్రమే మనకు సన్మార్గాన్ని చూపుతాయని ఉపదేశించారు. కృష్ణ బోధనలు, శ్రీకృష్ణుడి జీవితమే మానవాళికి దారి చూపుతుందని ప్రబోధించారు.

శ్రీల ప్రభుపాద జన్మించిన రోజున ప్రపంచవ్యాప్త కృష్ణ భక్తులు "హరే కృష్ణ హరికృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ; హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అంటూ భజనలు, కీర్తనలు జపిస్తూ తమ భక్తిని చాటుకుంటారు. కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్న ప్రసాద్ వితరణలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్త "ఇస్కాన్ హరే కృష్ణ ఉద్యమం" ద్వారా ప్రజలను భక్తి నీడలో సేదదీరాలంటూ, శాంతి సౌభాగ్యాలతో జీవితాలను సుసంపన్నం చేసుకోవాలంటూ ఇస్కాన్ నేడు ప్రతి పట్టణ, పల్లెల్లో ప్రచారాలను నిర్వహిస్తున్నది. పరమ కృష్ణుడి భక్తుడైన ప్రభుపాదుల వారు కృష్ణుడు జన్మించిన తర్వాత రోజున నందోత్సవ సమయంలో జన్మించడం ఓ అద్భుత కృష్ణుడి లీలగా తీసుకోవాలి.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## గత 11 సంవత్సరాల పురోగతికి మార్గసూచీగా, వర్తమానానికి బలంగా, సంపన్న భారతదేశం కోసం

# ఒక వ్యూహంగా అభివర్ణించిన కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగష్టు 16:ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల ఏరివేత, మిషన్ సుదర్శన్ చక్ర ద్వారా దేశ మౌలిక సదుపాయాలకు రక్షణ, హైపవర్ డెమోగ్రఫీ మిషన్ ద్వారా దేశాన్ని చొరబాటురహితంగా ఉంచాలనే సంకల్పంతో భారత్ ను బలంగా, సురక్షితంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ దేశ రైతుల సంక్షేమానికి ప్రభుత్వ అచంచలమైన మద్దతును పునరుద్ఘాటించారు

అణు ఇంధనం, కీలక ఖనిజాలు, ఇంధనం, అంతరిక్షం, జెట్ ఇంజిన్ రంగాల్లో స్వావలంబన సాధించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

రాబోయే దీపావళి సందర్భంగా, పన్ను ఉపశమనం కలిగించడానికి, పౌరులకు జీవితాన్ని సులభతరం చేయడానికి, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడానికి తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలను ప్రధాని మోదీ ప్రకటించారు

ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగం పొందుతున్న వారికి రూ 15,000 అందిస్తూ, రూ.లక్ష కోట్లతో 'ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్గార్ యోజన'ను ప్రారంభించడం ద్వారా ప్రధాని మోదీ యువతకు కానుక ఇచ్చారు.

ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల ఘన చరిత్రను, దేశ నిర్మాణంలో దాని సేవలను ప్రముఖంగా వివరిస్తూ, దాని కార్యకర్తలందరికీ నివాళులు అర్పించారు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వీయ ఎదుగుదలతో పాటు సేవ, అంకితభావం, సంఘటితం, క్రమశిక్షణ ద్వారా జాతి నిర్మాణంలో తన నిబద్ధతను నెరవేరుస్తూనే ఉంది

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని గత 11 సంవత్సరాల పురోగతికి మార్గసూచీగా, వర్తమానానికి బలంగా, సంపన్న భారతదేశం కోసం ఒక వ్యూహంగా కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అభివర్ణించారు.

ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల ఏరివేత, మిషన్ సుదర్శన్ చక్ర ద్వారా దేశ మౌలిక సదుపాయాలకు రక్షణ, హైపవర్ డెమోగ్రఫీ మిషన్ ద్వారా దేశాన్ని చొరబాటురహితంగా ఉంచాలనే సంకల్పంతో భారత్ ను బలంగా, సురక్షితంగా మార్చడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ అమిత్ షా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో వరుస పోస్టుల్లో పేర్కొన్నారు.

రైతుల ప్రయోజనాల పట్ల తిరుగులేని ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ప్రధాని మోదీ, అణు ఇంధనం, కీలకమైన ఖనిజాలు, ఇంధనం, అంతరిక్ష రంగం, జెట్ ఇంజిన్ల రంగాల్లో స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

అంతేకాక, 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్గార్ యోజన' ప్రకటన, రానున్న దీపావళి కానుకగా జీఎస్టీ లో తీసుకువచ్చే గణనీయమైన ఉపశమన చర్యలు ప్రజల జీవితాలను సులభతరం చేస్తాయని, చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తాయని ఆయన తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ లక్ష కోట్ల రూపాయల నిధులతో 'ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్గార్ యోజన' అమలును ప్రకటించడం ద్వారా దేశ యువతకు కానుక ఇచ్చారని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ పథకం కింద, ప్రైవేట్ రంగంలో మొదటిసారి పనిచేసే ఉద్యోగులకు రూ.15,000 లభిస్తాయని, ఎక్కువ ఉద్యోగాలను సృష్టించే కంపెనీలకు ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. సుమారు 3.5 కోట్ల మంది యువతకు లాభం చేకూర్చే ఈ కార్యక్రమం, భారత యువతకు ఒక స్వర్ణావకాశంగా నిలిచి, ఆత్మనిర్భర్ భారత ప్రయాణాన్ని బలోపేతం చేస్తుంది.

చిన్న వ్యాపారాలకు సాధికారత కల్పించడం ద్వారా స్వావలంబన భారత్ దిశగా మోదీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి పేర్కొన్నారు. ఎర్రకోటపై నుంచి ప్రధాని మోదీ దేశానికి దీపావళి కానుకగా జీఎస్టీ సంస్కరణలను ప్రకటించారు. ఈ సంస్కరణలు చిన్న పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం చేకూర్చడమే కాకుండా రోజువారీ నిత్యావసరాలను మరింత చౌకగా అందిస్తాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఈ ప్రయత్నం భారత ఆర్థిక శక్తిని మరింత బలపరచి, ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశలో గణనీయమైన పాత్ర పోషిస్తుంది.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రారంభించడం చారిత్రాత్మకమని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ మిషన్ లో భాగంగా 2035 నాటికి కీలకమైన జాతీయ ప్రదేశాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శక్తిమంతమైన ఆయుధ వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. శత్రువుల దాడులను నిర్వీర్యం చేయడమే కాకుండా సుదర్శన చక్రం తరహాలో ప్రభావవంతమైన ప్రతిదాడులు చేయడం కూడా ఈ మిషన్ లక్ష్యం. ఈ చర్య జాతీయ భద్రతను దుర్భేద్యంగా మార్చడంలో, అలాగే ప్రత్యర్థులపై లక్ష్య నిర్దేశిత దాడులకు వీలు కల్పించడంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది.

ప్రధాని మోదీ తమ చారిత్రాత్మక స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) 100 సంవత్సరాల ఘనమైన చరిత్రను, దేశ నిర్మాణానికి అది అందించిన సేవలను ప్రముఖంగా ప్రస్తావించారని, 100 సంవత్సరాల దేశ పురోగతి ప్రయాణంలో అసమానమైన కృషి చేసిన ఆరెస్సెస్ వాలంటీర్లందరికీ నివాళులు అర్పించారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. గత శతాబ్దకాలంగా సేవ, అంకితభావం, సంఘటితం, క్రమశిక్షణతో స్వీయ వికాసం ద్వారా దేశ నిర్మాణం అనే తన సంకల్పాన్ని ఆరెస్సెస్ నెరవేర్చింది.

## అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఆగష్టు 16:మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళు లర్పించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విధంగా పేర్కొన్నారు.

"మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ పుణ్యతిథి సందర్భంగా దేశ ప్రజలందరి తరపున నేను ఆయనకు గౌరవప్రదమైన నివాళులు అర్పిస్తున్నాను.

దేశ సర్వతోముఖాభివృద్ధి విషయంలో ఆయన చూపించిన అంకితభావం, సేవాభావం స్వావలంబన కలిగిన వికసిత్ భారతదేశాన్ని నిర్మించేందుకు దోహదపడేలా ప్రతి ఒక్కరినీ ప్రేరేపిస్తుంది."

## మర్రిచెట్టుతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



నల్గొండ, ఆగషు 16: దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపీడీఓ డ్యానియల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సకాలంలో ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి మాజీ ఎంపీటీసీ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నేత కొర్ర రాంసింగ్ నాయక్, సీత్య నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ ఉప సర్పంచ్ చిన్న నాయక్, పంచాయతీ కార్యదర్శి కీర్తి, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రేషన్ లబ్ధిదారులకు ఇకపై ఆ సమస్య ఉండదు

హైదరాబాద్, ఆగష్టు 16:ప్రతి నెల రేషన్ కోసం ఇంటి నుండి సంచులను తీసుకెళ్లడం సాధారణ విషయం. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండబోతోంది. వచ్చే నెలలో రేషన్ దుకాణాలలో లబ్ధిదారులు కొత్త అనుభవాన్ని ఎదుర్కోబోతున్నారు. రేషన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది.

రేషన్ కార్డుదారులకు సాధారణ బియ్యం మాత్రమే కాకుండా ఎకో ఫ్రెండ్లీ సంచులను కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో లబ్ధిదారుల సౌకర్యాన్ని పెంచడమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు జరగనుంది. ఈ సంచులు ఇప్పటికే జిల్లాల వారీగా స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. కార్డుల సంఖ్య ప్రకారం రేషన్ డీలర్లకు అధికారుల ద్వారా పంపిణీ జరగనుంది.

ఈ సంచులపై కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాలను ప్రస్తావించే లోగో, దాంతో పాటు 'అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదం ముద్రించి ఉటుంది.

రాష్ట్రంలో సుమారు 95 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందజేస్తున్నారు. వర్షాకాల సమస్యలను దృష్టిలో ఉంచుకొని జూన్ నెలలోనే జూన్, జులై, ఆగస్టు నెలల రేషన్‌ను ముందుగానే పంపిణీ చేశారు.

రేషన్ ద్వారా బియ్యం మాత్రమే కాకుండా చక్కెర, గోధుమలు అందుతున్నాయి. ప్రజలు అయితే నూనె, పప్పులు, చింతపండు, ఉప్పు వంటి నిత్యావసర వస్తువులు కూడా ఇలాగే రేషన్ షాపుల ద్వారా అందించాలని కోరుతున్నారు.

ఈ కొత్త నిర్ణయంతో, ప్రతి రేషన్ లబ్ధిదారునికి ఇప్పుడు బియ్యంతో పాటు పర్యావరణ అనుకూల సంచి లభిస్తుంది. ఇది పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా ప్రజలకు సౌకర్యాన్ని కూడా కలిగించనుంది.

## చిగురుమామిడిలో ఆశా వర్కర్స్ మండల యూనియన్ ఎన్నిక

కరీంనగర్, ఆగష్టు 16: చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్స్ యూనియన్ ఎన్నికలు మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షురాలిగా నాగేల్లి పద్మ, ప్రధాన కార్యదర్శిగా బోయిని ప్రియాంక, కోశాధికారిగా అంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేళ్ల శ్రీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆగస్టు 28న కరీంనగర్లో జరుగుతుందన్నారు.

ఆశా వర్కర్ల సమస్యల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేసిన చరిత్ర ఉందని, వారికి అండగా ఉంటామన్నారు. కనీస కార్మికులుగా గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వీరికి ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర సౌకర్యాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలే తప్ప మరో మార్గం లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ బండారి సరోజన, లక్ష్మి, సుజాత, కల్పన,సునీత తో పాటు మండలంలోని ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం : పిట్టల అశోక్ ముదిరాజ్



నల్గొండ, ఆగషు 16:కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, చార్జిషీట్ విడుదల కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ బీబీనగర్ మండల మాజీ అధ్యక్షుడు పిట్టల అశోక్ ముదిరాజ్ అన్నారు. బీబీనగర్ అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గోలి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పిట్టల అశోక్ మాట్లాడుతూ.. ఎన్నికలల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావొస్తున్నా ప్రచార ఆర్భాటాలు తప్పా పని చేసింది ఏమి లేదని విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమస్య ఉన్నచోటికి వచ్చి ఫొటోలు దిగడం, శిలాఫలకాలు వేయడం తప్పా పూర్తిచేసిన పని ఒక్కటీ లేదన్నారు. పట్టణ కేంద్రంలో మురికి నీరు చెరువులో కలుస్తుందని సంవత్సర కాలంగా పోరాడుతున్నా ఎలాంటి స్పందన లేదన్నారు.

బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించామని, వాటికి చిన్నపాటి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలన్నారు. పట్టణ కేంద్రంలో ఓ దాత ఇచ్చిన ఆరు ఎకరాలు భూమి ఆక్రమణలకు గురైందని, ఆ స్థలంపై విచారణ జరిపి ఆక్రమణలు తొలగించాలని కోరారు. అదేవిధంగా బీబీనగర్ ఎయిమ్స్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. బీబీనగర్ పట్టణం చుట్టుపక్కల ఉన్న అనేక వెంచర్ల నుండి గ్రామ పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరుకు బోరు నీళ్లు కలిపి సరఫరా చేస్తున్నారని, ప్రజల ఆరోగ్యం కరాబ్ అవుతుందని దుయ్యబట్టారు. బీబీనగర్ పెద్ద చెరువు కింద బుంగ ఏర్పడిందని దానిని రిపేర్ చేయాలన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే అనేక సమస్యలు ఉన్నాయని విమర్శించారు.

స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంటే అణచివేసే కార్యక్రమం మంచిది కాదన్నారు. పోలీసులను పెట్టి చార్జ్‌షీట్ విడుదల కార్యక్రమాన్ని అడ్డగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమృతం శివకుమార్, గుంటిపల్లి లక్ష్మీనారాయణ, దేవరకొండ శ్రీనివాస్, కట్ట నరేశ్, కాట్రోత్ శివ, జాని, మిట్టు, పేరబోయిన నరేశ్ యాదవ్, పంజాల మహేశ్ గౌడ్, కుశంగుల మురళి, బోయిన కృష్ణ, ఉడుత మహేశ్, కుశంగుల రాము, మరి శ్రీకాంత్, జాడ సంతోశ్ పాల్గొన్నారు.

### కృష్ణ జన్మాష్టమి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి


న్యూఢిల్లీ, ఆగష్టు 16:కృష్ణ జన్మాష్టమి సందర్భంగా అందరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విధంగా పేర్కొన్నారు" దేశ ప్రజలందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు. విశ్వాసం, ఆనందం, ఉత్సాహంతో కూడిన ఈ పవిత్ర పండుగ అందరి జీవితంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. జై శ్రీ కృష్ణ! "


## జ్యోతి ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

ఖమ్మం, ఆగష్టు 16: తెలంగాణా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్ కొత్తగూడెం ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ సభ్యులు రామచంద్రమూర్తి 80వ జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు జ్యోతి ఆశ్రమానికి రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆశ్రమానికి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందిస్తూనే ఉన్నామని, ఇక ముందు కూడా తమ శక్తి మేరకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సెక్రటరీ సురేశ్ కుమార్, పాండురంగారావు, శివరామకృష్ణ, ,సీతారామశాస్త్రి, జోసెఫ్, కామేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, గురుమూర్తి పాల్గొన్నారు. అలాగే జోసెఫ్ కుమారుడు డాక్టర్ ఆర్‌జే ప్రశాంత్ జన్మదిన సందర్భంగా ఆశ్రమంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

# డా॥ సనుజిత్. ఎ. పావుడేకు గోల్డ్ మెడల్స్




హైదరాబాద్, ఆగష్టు 16:ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి తొలి సారి డా. సనుజిత్. ఎ. పావుడే గోల్డ్‌మెడల్‌ను సొంతం చేసుకున్నారు. శుక్రవారం ఉస్మానియా మెడికల్ కాలేజ్ అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యం లో ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి చెందిన డా.సనుజిత్.ఎ.పావుడెకి గోల్డ్‌మెడల్ ను ప్రదానం చేశారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన డా. సనుజిత్‌కు, న్యూరో విభాగం నుంచి డాక్టర్ మేఘన చిగురుపాటికి గోల్డ్‌మెడల్స్‌ను అందజేసిన ట్లుడాక్టర్‌లక్ష్మీపలుకూరివెల్లడిం చారు.

# శ్రీవాణి టికెట్లపై గందరగోళం

తిరుపతి, ఆగష్టు 16: తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం భక్తుల తపన ఏ స్థాయిలో ఉందో మరోసారి బయటపడింది. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోసం రాత్రి నుంచే బారులు తీరిన భక్తులు, రద్దీ పెరగడంతో తోపులాటలు, నిరసనలతో కలకలం రేగింది.

తిరుమలలో శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల విక్రయాలపై మళ్లీ గందరగోళం చోటు చేసుకుంది. శ్రీవాణి దాతలకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు టికెట్లు విక్రయిస్తామని తితిదే ఇటీవలే ప్రకటించింది. అయితే, వీటికి అధిక డిమాండ్ ఉండటంతో భక్తులు ముందురోజు రాత్రి నుంచే క్యూలైన్‌లలో నిలుస్తున్నారు. రద్దీ అధికమవుతుందని భావించిన అధికారులు పలుసార్లు ముందుగానే, వేకువజామునే టికెట్లను విక్రయిస్తున్నారు.

శుక్రవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. అర్ధరాత్రి నుంచే టికెట్ల విక్రయం ప్రారంభం కావడంతో, విజిలెన్స్ సిబ్బందిని తప్పించుకుని భక్తులు తొందరపాటుతో క్యూలైన్లలోకి దూసుకెళ్లారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. కొందరు భక్తులు టికెట్లు దొరక్కపోవడంతో అన్నమయ్య భవనం ఎదుట నిరసన చేపట్టారు. వెంటనే అక్కడికి చేరుకున్న విజిలెన్స్ అధికారులు వారికి సర్దిచెప్పి శాంతింపజేశారు.

# ఆగస్టు 17న ఢిల్లీలో రూ.11,000 కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 16:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 17న మధ్యాహ్నం 12:30 గంటలకు దాదాపు రూ. 11,000 కోట్ల వ్యయంతో చేపట్టిన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ఢిల్లీలోని రోహిణిలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడనున్నారు.

ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాలలో అనుసంధానతను బాగా మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రభుత్వం రూపొందించిన సమగ్ర ప్రణాళిక కింద ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-ఎఎ ప్రాజెక్టులను చేపట్టారు. జీవన సౌలభ్యాన్ని పెంచటం, ఆటంకం లేని ప్రయాణం అందించే ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలనే ప్రధానమంత్రి మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులు ఉన్నాయి.

ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేలోని 10.1 కి.మీ. ఢిల్లీ విభాగాన్ని దాదాపు రూ. 5,360 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఈ విభాగం యశోభూమి, డీఎంఆర్‌సీ నీలి రంగు మార్గం, నారింజ రంగు మార్గం.. రాబోతున్న బిజ్వాసన్ రైల్వే స్టేషన్, ద్వారకా క్లస్టర్ బస్ డిపోలకు మల్టీ-మోడల్ అనుసంధానతను అందిస్తుంది. ఈ విభాగంలో ఇవి ఉన్నాయి:

శివ మూర్తి కూడలి నుంచి ద్వారకా సెక్టార్-21 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) వరకు 5.9 కి.మీ. రహదారి.

ద్వారకా సెక్టార్-21 ఆర్‌యూబీ నుంచి ఢిల్లీ-హర్యానా సరిహద్దు వరకు ఉన్న ఈ 4.2 కి.మీ. రహదారి అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-ఎఎకి ప్రత్యక్ష అనుసంధానతను ఇస్తుంది.

ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేలోని 19 కి.మీ పొడవైన హర్యానా విభాగాన్ని ప్రధానమంత్రి మార్చి 2024లో ప్రారంభించారు.

అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-ఎఎలోని (యూఈఆర్-ఎఎ) అలీపూర్ నుంచి డిచాన్ కలాన్ వరకు ఉన్న రహదారిని కూడా ప్రారంభిస్తారు. అలాగే బహదూర్‌గఢ్, సోనిపట్‌లకు నిర్మించిన కొత్త లింక్ రోడ్లను కూడా ప్రారంభిస్తారు. వీటిని దాదాపు రూ. 5,580 కోట్లతో నిర్మించారు. ఇది ఢిల్లీ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు.. ముకర్బా చౌక్, ధౌలా కువాన్, ఎన్‌హెచ్-09 వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాఫిక్ రద్దీని తగ్గించనుంది. ఇవి బహదూర్‌గఢ్, సోనిపట్‌లకు ప్రత్యక్ష అనుసంధానను అందిస్తాయి. దీనితో పాటు పారిశ్రామిక ప్రాంతాల మధ్య అనుసంధానను మెరుగుపరుస్తాయి. అంతేకాకుండా నగర ట్రాఫిక్‌ను తగ్గిస్తూ రాజధాని ప్రాంతంలో రవాణాను వేగవంతం చేస్తాయి.

# అజ్ఞానాన్ని తొలగించడమే ఆర్య సమాజ్ లక్ష్యం



మహబూబ్‌నగర్, ఆగష్టు 16:అజ్ఞానాన్ని తొలగించి ప్రతి మనిషిలో జ్ఞానాన్ని పెంపొందించడమే ఆర్య సమాజ్ లక్ష్యమని పండిత్ ప్రియదత్తు శాస్త్రి అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ మందిరంలో శనివారం శ్రావణ వేద త్రిదివసీయ యజుర్వేద పారాయణ మహా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో దంపతులు పాల్గొని అగ్ని దేవతకు నెయ్యి, సామాగ్రి, సమిధలు, సుగంధ పరిమళం సమర్పించారు

ఈ సందర్భంగా పండిత్ ప్రియ దత్తు శాస్త్రి మాట్లాడుతూ.. వేదాలను పఠించి ప్రతి ఒక్కరూ ధర్మబద్ధంగా నడుచుకోవాలని ఉపదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్య సమాజ్ ప్రధాన్ కనకప్ప ఆర్య, కమిటీ సభ్యులు జ్ఞానేశ్వర్ రావు ఆర్య, బాల్ రాజ్ ఆర్య, పవన్ కుమార్ ఆర్య, సుజాత భజనలు, భక్తి గీతాలతో అలరించారు. కార్యక్రమానికి హాజరైన వారికి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పద్మా రెడ్డి, రామ్ మనోహర్ రావు, శంకరయ్య, దివాకర్ యాదవ్, గోపాల్ రెడ్డి, టీ. వెంకటేష్, దొడ్డి శ్రీనివాసులు, రమాదేవి పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉగ్ర కలకలం..రంగంలోకి ఎన్ఐఏ

అమరావతి, ఆగష్టు 16:శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో ఉగ్రవాద కార్యకలాపాల అనుమానంతో ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) దర్యాప్తు తీవ్ర కలకలం రేపింది. కోట కాలనీకి చెందిన నూర్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరంలోని ఒక హోటల్‌లో వంటవాడిగా పనిచేస్తున్న నూర్, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నాడని ఎన్ఐఏ అనుమానిస్తోంది. నూర్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు, అతని నుంచి 16 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సిమ్‌కార్డుల ద్వారా అతను ఎవరితో సంప్రదింపులు జరిపాడు అనే దానిపై లోతుగా విచారణ చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే నూర్‌ను అదుపులోకి తీసుకుని, రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం.

గతంలో జరిగిన ఉగ్రవాద కేసుల విచారణలో భాగంగా, ధర్మవరంలో నూర్‌కు టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. పక్కా సమాచారంతో, అత్యంత గోప్యంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించి నూర్‌ను అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా నూర్ కదలికలపై అధికారులు నిఘా పెట్టారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటన ధర్మవరం ప్రాంతంలో ఆందోళన కలిగించింది.

# న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన గణాంక సలహాదారుల సెన్సిటైజేషన్ మరియు సమీక్ష సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 16:గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆగష్టు 14, 2025న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గణాంక సలహాదారుల యొక్క మూడవ రౌండ్ సెన్సిటైజేషన్ మరియు సమీక్ష సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది.

సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేయడానికి మరియు ప్రభుత్వం అంతటా బలమైన, డేటా ఆధారిత నిర్ణయాత్మక పర్యావరణ వ్యవస్థను సృష్టించడానికి మంత్రిత్వ శాఖ యొక్క ప్రస్తుత ప్రయత్నంపై సంప్రదింపులను విస్తృతం చేయడానికి ఈ సమావేశం నిర్వహించబడింది. ప్రారంభ సమావేశంలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ మాజీ చైర్మన్ శ్రీ ఆదిల్ జైనుల్భాయ్; నీతి ఆయోగ్ శ్రీ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం కార్యదర్శి శ్రీ ఎస్ కృష్ణన్; ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్; కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్ మరియు అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రవీణ్ శుక్లా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల నుండి గణాంక సలహాదారులు మరియు ప్రతినిధులు, అలాగే సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రవీణ్ శుక్లా పాల్గొన్న వారిని స్వాగతించారు.

ముఖ్య అతిథి, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ మాజీ చైర్మన్ శ్రీ ఆదిల్ జైనుల్భాయ్ తన ముఖ్యోపన్యాసంలో, ఆధునిక గణాంక పద్ధతులను ప్రోత్సహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉండటం




మరియు అంతర్-మంత్రిత్వ సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడాన్ని ప్రోత్సహించడానికి ఓసీఖఎ యొక్క సెన్సిటైజే షన్-కమ్-రివ్యూ వర్క్‌షాప్‌లను ప్రశంసించారు.

ప్రపంచంలో బంగారు ప్రమాణంగా మారడానికి మన డేటా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. నేషనల్ మెటాడేటా స్ట్రక్చర్, హ్యాకథాన్‌ల శ్రేణి మరియు ఇ-సంఖ్యికి పోర్టల్ వంటి చొరవలు డేటా యాక్సెసిబిలిటీ మరియు నాణ్యతను గణనీయంగా పెంచుతున్నాయని, గణాంకాలను కొలవడానికి మాత్రమే కాకుండా, ఖచ్చితత్వం, సమగ్రత మరియు ఆవిష్కరణలతో భారతదేశ వృద్ధి కథను రూపొందించడానికి కూడా శక్తివంతం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.


కాగిత రహిత ఎన్ఎస్ఎస్ ఆన్‌లైన్, డిజిటల్ మరియు రియల్ టైమ్‌గా మారడానికి పరివర్తన చెందాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

అన్ని విధాలుగా గణాంకాలను డిజిటలైజేషన్ చేయాలని మరియు అన్ని స్థాయి గణాంక అధికారులకు ఎఐ వాడకాన్ని ప్రోత్సహించాలని కూడా ఆయన సూచించారు. సాంప్రదాయ మరియు అభివృద్ధి చెందుతున్న డేటా వనరులను సమన్వయం చేయడానికి, సాంకేతికత ఆధారిత పరిష్కారాలను స్వీకరించ డానికి మరియు విశ్వసనీయమైన, సమయానుకూలమైన మరియు నిష్పాక్షికమైన గణాంకాలను నిర్ధారించ డంలో అవసరమైన డేటా సమగ్రతకు సంరక్షకులుగా గణాంక సలహాదారుల కీలక పాత్రను ఆయన హైలైట్ చేశారు.

# బుర్ర సుధాకర్‌కు మాజీ ఎమ్మెల్యే కంచర్ల పరామర్శ

నల్గొండ, ఆగషు 16:బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, నల్లగొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి సధాకర్‌ను పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులను సుధాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాల్సిందిగా కోరారు. ఆయన త్వరగా కోలుకుంటారని, పూర్తి ఆరోగ్యంగా ఇంటికి వస్తారని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

# శ్రీశైలం ఆలయానికి పోటెత్తిన భక్తులు.. 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్



శ్రీశైలం, ఆగష్టు 16: వరుసగా సెలవులు రావడంతో.. అటు భక్తులు, ఇటు పర్యాటకులు శ్రీశైలం పయనమవుతున్నారు. ఇప్పటికే వేల మంది భక్తులు, పర్యాటకులు శ్రీశైలం దారి పట్టారు. దీంతో శ్రీశైలంకు వెళ్లే దారులు వాహనాలతో నిండిపోయాయి. ఐదు కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. శ్రీశైలం స్విచ్ యార్డ్ వరకు వాహనాలు బారులు తీరాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల ఎత్తడంతో.. ఆ అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తమ వాహనాలను ఎక్కడంటే అక్కడ ఆపడంతో.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తారు. దిగువకు లక్షా 33 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.1 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటినిల్వ 199.73 టీఎంసీలుగా ఉంది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్‌కు 65,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# మేడ్చల్ జిల్లాలో సరోగసి కేసులో బయటకు వచ్చిన సంచలన నిజాలు

హైదరాబాద్ ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మేడ్చల్ జిల్లాలో సరోగసి కేసులో సంచలన నిజాలు బయటకు వచ్చాయి. సరోగసి మహిళలతో నిందితురాలు బాండ్లు రాయించుకున్నారు. తనిఖీల్లో భారీగా ప్రామిసరీ నోట్లు, బాండ్లు బయటపడ్డాయి. పెద్ద ఎత్తున హార్మోన్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐవీఎఫ్ సెంటర్‌కు వెళ్లిన దంపతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితురాలు లక్ష్మి ఏజెంట్ల ద్వారా సేకరిస్తున్నారు. లక్ష్మి నివాసంతో పాటు హెగ్డే ఆస్పత్రి, పలు ఫెర్టిలిటీ సెంటర్ల రిపోర్టులు గుర్తించారు. ఐవీఎఫ్ సెంటర్లతో లక్ష్మికి ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. లక్ష్మి మహిళలను ప్రలోభపెట్టి సరోగసికి ఒప్పిస్తున్నారు. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు మహిళలతో బేరం కుదుర్చుకున్నట్టు పోలీసులు గుర్తించారు. సరోగసి కోసం వచ్చిన దంపతుల దగ్గర రూ.25 లక్షల వరకు లక్ష్మి వసూలు చేస్తున్నారు. పిల్లల విక్రయాల కేసులో గతంలో లక్ష్మిని ముంబయి పోలీసులు అరెస్ట్ చేశారు. 8 మంది మహిళలకు ఇప్పటికే పోలీసుల నోటీసులు ఇచ్చారు. నిందితురాలు లక్ష్మి, కుమారుడు నరేందర్ పోలీసులు రిమాండ్‌లో ఉన్నారు. డాక్టర్ విద్యుల్లత పేరుతో అనుమతులు తీసుకుని యూనివర్సల్ సృష్టి పేరుతో ఐవీఎఫ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో డాక్టర్ నమ్రత, డాక్టర్ విద్యుల్లత కలిసి ఐవీఎఫ్ కోసం వచ్చిన దంపతులకు సరోగసికి వెళ్లలని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. రాజస్థాన్ కు చెందిన దంపతులను సరోగసీ పేరుతో వేరే వారి బాలుడిని తీసుకుని వచ్చి ఇవ్వడంతో వారు డిఎన్ఎ టెస్ట్ చేయించగా వారి కుమారుడు కాన్న తేలింది. దీంతో బాధితులు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. విచారణ చేసిన పోలీసులు నిందితులను వరుసగా అరెస్టు చేస్తున్నవిషయం తెలిసిందే. నిందితులు విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు పోలీసులు ముందుగానే లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. డాక్టర్ నమ్రత పిల్లలను కిడ్నాపింగ్ చేసే గుజరాత్‌కు చెందిన డోక్ల గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్లు బయటపడింది.

# అసంపూర్తి కాల్వలను వెంటనే పూర్తి చేయాలి : తుమ్మల వీరారెడ్డి



నల్గొండ, ఆగషు 16: సంవత్సరాలు గడిచినా బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్ట్ నేటికీ పూర్తి కాకపోవడం సిగ్గుచేటని, అసంపూర్తిగా వదిలేసిన కాల్వల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన కాల్వలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులను గాలికి వదిలేసి గాలి మోటారులో తిరుగుతున్నారన్నారు. శ్రీశైలం స్వరంగ మార్గం పూర్తి చేస్తామని చెప్పి, కనీసం చనిపోయిన వ్యక్తుల శవాలను కూడా బయటకు తీయలేని దుస్థితి నెలకొన్నదని విమర్శించారు.

బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ క్రింద కాల్వలు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసమర్థత వల్లే కాల్వలు పూర్తి కావడం లేదని దుయ్యబట్టారు. ఎస్ఎల్‌బీసీ కింద పిల్ల కాల్వలను వెంటనే పూర్తి చేసి రైతుల పంట పొలాలకు నిరంధించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, బొల్లు రవీందర్, మచ్చా యాదయ్య, రైతులు మచ్చ యాదయ్య, పందుల భిక్షం, దొడ్లపాటి ప్రతాపరెడ్డి, నాంపల్లి యాదయ్య, ఈర్ల నాగేశ్, పీర్ల రాంబాబు, దొడ్లపాటి నర్సిరెడ్డి, దైద భూషణ్ రెడ్డి, కాసర్ల రమాశంకర్, ఎరకలి నరసింహ పాల్గొన్నారు.

# స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం




జనగాం ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: స్నేహం పేరుతో నమ్మించి ఓ యువతిపై పది మంది సామూహిక అత్యాచారం చేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన జనగామ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?జనగామ జిల్లాకు చెంది మోహమ్మద్ ఒవైసి, ముత్యాల పవన్ కుమార్, బౌద్ధుల శివ కుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎమ్.డి. అబ్దుల్ ఖయూం, పుస్తకాల సాయి తేజ, ముట్టాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఒరుగంటి సాయి రామ్ అనే యువకులు ఓ యువతితో పరిచయం పెంచుకున్నారు. స్నేహం పేరుతో యువతిని జనగా-సూర్యాపేట రోడ్డులోని టీ వరల్డ్ లో ఓ రూమ్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆ యువతిపై పది మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులలో ఒకడు యువతిని గోవాకు తీసుకెళ్లి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం బాధితురాలి అత్తకు తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పది మంది నిందితులను సిద్దిపేట రోడ్డులో పట్టుకున్నారు. సిఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ భరత్ వారిని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీకి సిఫారసు

## -మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్ ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని మునుగోడు నియోజక వర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామని, రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో త్వరలో స్పష్టత వస్తుందని, మార్వాడీలు మనలో ఒకరని, వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ తరపున శ్రీవారి సారె సమర్పణ



తిరుపతి, ఆగష్టు 16: ఆడికృతిక పర్వదినం సందర్భంగా తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు శనివారం శ్రీవారి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో తిరుత్తణి ఆలయ చైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవాదయశాఖ జాయింట్ కమిషనర్ రమణి టీటీడీ చైర్మన్‌కు స్వాగతం పలికారు.

అనంతరం మంగళవాయిద్యాల నడుమ చైర్మన్ బీ.ఆర్. నాయుడు టీటీడీ తరపున పట్టు వస్త్రాలను తిరుత్తణి దివ్య క్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామికి సమర్పించారు.

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి దర్శన అనంతరం ఆలయ అర్చకులు చైర్మన్ ఆశీర్వచనం అందించి, పట్టువస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# శ్రీరామసాగర్‌కి జలకళ.. భారీగా వచ్చి చేరిన వరద నీరు

## – ప్రాజక్ట్‌లోకి 89,466 వేల క్యూసెక్కుల వరదనీరు



మెండోరా ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఉత్తర తెలంగాణ వరప్రదాయనిగా పేరుగాంచిన శ్రీ రామసాగర్ ప్రాజెక్టు ఎగువన గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర బాబ్లీ, విష్ణుపురి, మాలేగావ్ ప్రాజెక్టుల నుండి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 89,466 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.501 టిఎంసిలు ఉండగా శనివారం మధ్యాహ్నం వరకు 1082.30 అడుగులు 51.659 టిఎంసిలుగా ఉందని ప్రాజెక్టు ఎ.ఇ.ఇ.రవి తెలిపారు. ప్రధాన కాలువ కాకతీయ ద్వారా 4,625 వేల క్యూసెక్కులు, మంచి నీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1081.10 అడుగులు 48.071 టిఎంసిలుగా ఉందని.. జూన్ 1 నుండి ఇప్పటివరకు 46.930 టిఎంసిల నీరు వచ్చి చేరిందని వివరించారు. జూన్ 1 నుండి ఇప్పటివరకు 8.937 టిఎంసీ ల నీరు విడుదల చేశామని అధికారులు తెలిపారు. కాగా గోదావరి నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గోదావరి నదిలో భారీగా వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నదీ పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు మరియు సామాన్య జనం గోదావరి నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.చక్రపాణి తెలిపారు.

# మరోసారి ప్రమాదపుటంచున తుంగభద్ర జలాశయం

## -జలాశయంలోని మొత్తం 33 గేట్లలో పనిచేయని మరో ఏడు గేట్లు ?

## -జలాశయానికి వచ్చి చేరుతున్న23 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం

బెంగళూరు ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కర్ణాటక హోస్పేటలోని తుంగభద్ర జలాశయం మరోసారి ప్రమాదపుటంచున నిలిచింది. గతేడాది ఇదే నెలలో వరద ఉధృతికి 19వ గేటు కొట్టుకోపోయిన విషయం తెలిసిందే. దీంతో దానిని స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. తాజాగా జలాశయంలోని మొత్తం 33 గేట్లలో మరో ఏడు గేట్లు పనిచేయడం లేదని తేలింది. దీంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్యామ్ భద్రతపై సర్వత్రా ఆందోళన నెలకొన్నది. గతేడాది ఆగస్టు 10న వచ్చిన వరదలకు డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో కన్నయ్యానాయుడు సలహాతో స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగేటు తయారు చేసినప్పటికీ ఈ ఏడాది ముందస్తు వరదలతో ఆ గేటును అమర్చలేకపోయారు. కాగా, జలాశయానికి ఉన్న మొత్తం గేట్ల కాలపరిమితి దాటిపోయిందని, అన్నిటినీ మార్చాల్సిందేనని ఆయన సూచించారు. వచ్చే ఏడాది జూన్‌లోగా మొత్తం 33 గేట్లను మార్చాలన్న ఉద్దేశంతో జలాశయం సమీపంలోని గదగలో గేట్ల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే మరో ఏడు గేట్లు (4, 11, 18, 20, 24, 27, 28) ప్రమాదంలో ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీంతో ఎంత వరద వచ్చినా వాటిని మాత్రం ఎత్తకూడదని ఇంజినీర్లు నిర్ణయించినట్లు తెలుస్తున్నది. 4వ గేటును ఓ అడుగుదాకా ఎత్తవచ్చు, తరువాత అదీ మొరాయించే అవకాశం ఉందని తెలిసింది. ప్రస్తుతం జలాశయానికి 23 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. మూడు గేట్లను మాత్రమే పైకెత్తి 9 వేల క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మిగిలిన వరదను కాలువలకు వదులుతున్నారు.

# ఉత్తమ అధికారిగా డీవైఎస్ఓ అజ్మీర రాందాస్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా డీవైఎస్ఓ రాందాస్ ఉత్తమ అధికారిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్, ఎస్పి మహేష్ బి గీతే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డీవైఎస్ఓ రాందాస్ పట్టు విడువని విక్రమార్కుడిలా, కష్టపడి పని చేసే నిబద్ధత, అంకితభావంతో, అద్భుతమైన నైపుణ్యంతో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వేదిక వెలుపల చేస్తున్న కృషికి, పని నిబద్ధతను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, కరాటే మాస్టర్లు, పక్షాన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉగ్రవాదులతో సంబందాలు ఉన్నాయనే అనుమానంతో ఏపిలో ఓ వ్యక్తిని అరెస్ట్

## –ఉలిక్కిపడిన శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం

ధర్మవరం ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉగ్రవాదుల కదలికలతో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం ఉలిక్కిపడింది. ఐబి అధికారులు, పోలీసులతో కలిసి ధర్మవరంలోని ఓ ఇంట్లో సోదాలు జరిపింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులతో సంబందాలు ఉన్నాయనే అనుమానంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఐబి అధికారులు, పోలీసులు కోట కాలనీలో నివసించే నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి ఇంట్లో సోదాలు జరిపి.. 16 సిమ్ కార్డులతో పాటు.. కొన్ని అనుమానిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నూర్ మహమ్మద్ స్థానికంగా ఓ టీ స్టాల్‌లో పని చేస్తున్నట్లు గుర్తించారు. అతడు కొద్ది రోజులుగా పాకిస్థాన్ ఉగ్రవాదులతో వాట్సాప్ కాల్స్ మాట్లాడుతున్నాట్లు తెలుస్తోంది. అంతేకాక.. ఉగ్రవాదులతో ఛాటింగ్ కూడా చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతానికి నూర్‌ని అదుపులోకి తీసుకొని చేసి విచారిస్తున్నారు

# వేతనాల పెంపు కోరుతూ ఎయిర్ కెనడా సిబ్బంది సమ్మె.. ఎక్కడికక్కడ నిలిచిన 700 సర్వీసులు..!

న్యూఢిల్లీ, ఆగస్టు 16: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది సమ్మెకు దిగడంతో ఎయిర్ కెనడా విమాన సర్వీసులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమ్మె నోటీసు గడువు నేటితో ముగియడంతో సిబ్బంది సమ్మెకు దిగారు. దాంతో ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ సర్వీసులు నిలిచిపోయాయి. సమ్మెకారణంగా తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నామని ఎయిర్ కెనడా ప్రకటించింది.

అయితే థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని ఆ సంస్థ తెలిపింది. అయితే సిబ్బంది సమ్మె కారణంగా రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. అందులో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత.

అయితే వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ ఆగస్టు 13న మూడు రోజుల సమ్మె నోటీసులు ఇచ్చింది. నేటితో నోటీసు గడువు ముగిసింది. అయినా ఇప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో సమ్మె ప్రారంభమైనట్లు సిబ్బంది యూనియన్ ప్రకటించింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న దాదాపు 700 ఎయిర్ కెనడా విమానాలు గ్రౌండ్‌కే పరిమితమయ్యాయి.

సమ్మె నేపథ్యంలో సర్వీసులను క్రమంగా రద్దు చేస్తున్నామని, శనివారం నాటికి పూర్తిగా నిలిపివేస్తామని ఎయిర్ కెనడా ముందస్తుగా ప్రకటించింది. ఈ క్రమంలోనే నేడు అన్ని సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ విమానాల నిలిపివేత విదేశీ ప్రయాణాలపై అధికంగా ప్రభావం చూపనుంది. రద్దయిన విమానాల టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు పూర్తి రుసుము వాపస్ చేస్తామని ఎయిర్ కెనడా తెలిపింది. వీలైనంత వరకు ఇతర విమానయాన సంస్థలతో మాట్లాడి ప్రయాణికులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎయిర్ కెనడా అధికారులు చెప్పారు.

# సోమారంలో సెల్ఫీ తీసుకుని.. పురుగుల మందు తాగి యువకుడి మృతి

హైదరాబాద్, ఆగష్టు 16:సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాహూల్ (20) అనే యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం రాహూల్ గ్రామశివారులో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగగా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడినుండి వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

కాగా శనివారం ఉదయం రాహూల్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కాగా మృతుడికి ఇటీవల జ్వరంరాగా టెస్టులు చేయించగా పస్కలు వచ్చాయని ఆసుపత్రికి రెండురోజుల్లో తీసుకుని వెళ్తామని చెప్పగా అది మనసులో పెట్టుకుని పురుగుల మందు తాగినట్లు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్ఫీవీడియోతీసుకుని..

కాగా మృతుడు రాహూల్ పురుగుల మందు తాగేటప్పుడు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. పురుగుల మందు తాగుతూ అందరికీ బాయి.. మిస్యూ ఆల్.. హ్యాపీగా చస్తున్నా.. నేను మందే పిక్స్ అయినా అంటూ బెబుతున్న ఆ యువకుడి మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లీమీడియాలో వైరల్గా మారాయి.

# కుంగిన పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం

## - 10 అడుగుల వెడల్పుతో జారిన మట్టి

అమరావతి ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఇంకా పూర్తి కాకముందే అందులో లోపాలు బయటపడుతున్నాయి. ఎగువ కాఫర్ డ్యాంపై మట్టి కుంగింది. పది అడుగుల వెడల్పుతో 7 నుంచి 8 అడుగుల లోతుకు మట్టి జారింది. శుక్రవారం ఉదయం మట్టి కుంగడం గమనించిన అధికారులు వెంటనే స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన కుంగిన ప్రాంతాన్ని పటిష్టపరిచామని తెలిపారు. కాఫర్ డ్యాం ఎగువనే జారడం తప్ప దిగువ నుంచి ఎలాంటి సమస్య లేదని ఏపీ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు.

### కుంగిన ప్రాంతం ఏంటి?

పోలవరం ప్రధాన జలాశయం నిర్మాణం పూర్తయ్యేలోపు నీటిని మళ్లించేందుకు వీలుగా ఎగువ కాఫర్ డ్యాం నిర్మించారు. 2022 ఆగస్టులో గోదావరికి భారీ వరదలు వచ్చినప్పుడు తీవ్ర నష్టం సంభవించింది. దీంతో మరోసారి అలాంటి ప్రమాదం జరగొద్దని ఎగువ కాపర్ డ్యాం వెడల్పు 9 మీటర్లు ఉండేలా.. ఎత్తు మరో 2 మీటర్ల మేర పటిష్ఠం చేశారు. అలా పైన పెంచిన ప్రాంతంలో ఇప్పుడు కొంచెం మట్టి జారిందని అధికారులు వివరించారు. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం వద్ద మట్టి కుంగడం ఇప్పుడు సోషల్‌మీడియాలో చర్చకు దారి తీసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు సాంకేతిక సమస్యతో కుంగితే వెంటనే రంగంలోకి దిగిన ఎన్‌డీఎస్‌ఏ అధికారులు.. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు దగ్గరకు వస్తుందా అని ప్రశ్నిస్తున్నారు.

# వాజపేయి నాయకత్వంలో ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిన భారత్

## -బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అటల్ బిహారీ వాజపేయి పుణ్యతిథి సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు వాజపేయి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాజ్ పేయి విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు , రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రా రెడ్డి , రాష్ట్ర కార్యదర్శులు డా. ఎస్. ప్రకాష్ రెడ్డి , మాధవి , సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి ఒకసారి 13 రోజులు, మరోసారి 13 నెలలు, తర్వాత నాలుగున్నర సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్థికంగా కూడా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాలన ఒక నిదర్శనం. గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్ట్ ద్వారా జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులు వంటి అనేక మౌలిక వసతుల నిర్మాణాలు జరిగాయి. పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన సమయంలో



ప్రపంచంలోని అనేక దేశాలు భారత్‌పై ఆంక్షలు విధించాయి. అయినప్పటికీ వాజపేయి గారి నాయకత్వంలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించారు. వాజపేయి గారి పాలనను భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణిస్తారు. బియ్యం, గోధుమల వంటి ముఖ్యమైన ధాన్యాల సరఫరా, ఎగుమతి వ్యవస్థలో మార్పులు ఆయన పాలనలోనే చోటుచేసుకున్నాయి. వాజపేయి గారి జయంతిని ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మరియు బిజెపి "గుడ్ గవర్నెన్స్ డే"గా నిర్వహిస్తోంది. వాజపేయి గారు స్వయంసేవక్ సంఘ్ ప్రచారకుడిగా తన జీవితం ప్రారంభించి, ఆర్ఎస్ఎస్ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరి దేశ ప్రధానిగా కావడం ఆయన అసావాన్య వ్యక్తిత్వానికి నిదర్శనం. అలాంటి గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దిన ఆర్ఎస్ఎస్‌కు మనమంతా రుణపడి ఉన్నాం. వాజపేయి గారి లాంటి మహనీయులను దేశానికి అందించిన ఆర్ఎస్ఎస్, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిలాంటి నాయకులను కూడా తీర్చిదిద్దింది. రహదారుల నిర్మాణం ద్వారా దేశాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించిన వాజపేయి గారు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన దార్శనిక నాయకుడు. కొందరు ఆర్ఎస్ఎస్‌పై తప్పుగా మాట్లాడుతున్నారు. కానీ ఆర్ఎస్ఎస్ భారతదేశంలో పుట్టిన, భారతదేశం కోసం పుట్టిన సంస్థ. విమర్శకుల్లా చైనా, పాకిస్థాన్ ప్రయోజనాల కోసం మాట్లాడే పార్టీ కాదు. పేదలకు ఇండ్లు కల్పించాలనే సంకల్పంతో వాజపేయి గారు వాంబే అనే పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దత్తాత్రేయ పార్లమెంట్ సభ్యులుగా ఉండగా, ఈ పథకం కింద అనేక మంది పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పటికీ వారు ఆ ఇళ్లలో నివసిస్తూ లబ్ధి పొందుతున్నారు. కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను [illegible] మరిచిపోయాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టారు. రూ. 22,500 కోట్లు కేటాయించి ఇండ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు కడతామని హామీ ఇచ్చింది. కానీ 19 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఇండ్లు ఇచ్చిన దాఖలాల్లేవు. నిజమైన పేదలకు ఇండ్లు ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించే ప్రయత్నం జరుగుతోంది. దీని వలన అర్హులైన పేదలు మోసపోతున్నారన్నారు.. అటల్ బిహారీ వాజపేయి గారు ఆదర్శపురుషుడు. ఆయన పాలన మనకు స్ఫూర్తి, మార్గదర్శనం. బిజెపి కార్యకర్తలు మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ నాయకుడు కూడా ఆయన ఆశయబాటలో నడవడానికి కృషి చేయాలని నేను రామచంద్రా రావు కోరారు.

# అధర్మం ఎంత బలంగా ఉన్నా అతి తాత్కాలికమే.. వైఎస్ జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి, ఆగష్టు 16:పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో రిగ్గింగ్ చేసి టీడీపీ గెలిచిందని వైసీపీ ఆరోపిస్తున్న వేళ ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధర్మం ఎంత బలంగా ఉన్నా.. అది తాత్కాలికం మాత్రమేనని తెలిపారు. ధర్మం ఎంత నెమ్మదిగా వెళ్లినా అది శాశ్వతమని స్పష్టం చేశారు. శ్రీకృష్ణుని జీవితమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

కృష్ణాష్టమని సందర్భంగా వైఎస్ జగన్ తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగానే పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలో టీడీపీ అక్రమాల గురించి ఆయన పరోక్షంగా స్పందించారు.



పులివెందుల నియోజకవర్గంలోని ఒక చిన్న జడ్పీటీసీ సీటును లాక్కునేందుకు, రాజంపేటలో మరో చిన్న ఒంటిమిట్ట జిఖుఅ సీటును బలవంతంగా చెరబట్టేందుకు ఒక గూండా మాదిరిగా చంద్రబాబు అరాచకాలు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేశారని ఇటీవల జగన్ ఆరోపించారు. పులివెందుల ఉప ఎన్నికలో 15 పోలింగ్ బూత్‌లు ఉండగా, వాటిలో వైసీపీ ఏజెంట్లను అస్సలు ఉండనివ్వలేదని అన్నారు. ఏ ఒక్క ఏజెంట్‌ను బూత్ దగ్గరకు రానివ్వకుండా ఆపేసి రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. మీ పరిపాలన మీద మీకు విశ్వాసం ఉంటే.. మీరు ప్రజలకు మంచి చేశారని నమ్మితే వారు మీకు ఓటు వేస్తారనుకుంటే పులివెందుల ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే విడుదలైన ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

# సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు చెన్నైలో అంతర్జాతీయ కలినరీ పోటీలు



హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు చెన్నైలో అంతర్జాతీయ కలినరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సౌత్ ఇండియా కలినరీ అసోసియేషన్ ప్రధాన ఉద్దేశమని సీకా ఉపాధ్యక్షులు సుధాకర్ ఎన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సోమాజిగూడ లోని ద పార్క్ హోటల్ లో పెద్ద ఎత్తున వర్క్ షాప్ ను నిర్వహించారు. వవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలినరీ ఒలంపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యంగా అన్నారు. హైదరాబాద్ కు కలినరీ లో ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని అందుకు తగ్గట్టుగానే నేటి యువ తరాన్ని తయారు చేయాలన్నదే తమ ప్రధాన ధ్యేయం అని పేర్కొన్నారు. ఇందులో నగరంలోని ఆయా కళాశాలలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు, వివిధ హోటల్స్ లో కళాశాలలో పనిచేస్తున్న చెఫ్ లు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్ కు ప్రపంచ స్థాయిలో జరిగిన కలినరీ పోటీలో గోల్డ్ మెడల్స్ అందించిన ముగ్గురు ప్రధాన చీఫ్ చే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ పోటీ ఏ విధంగా ఉంటుంది అందులో ఏ ఏ అంశాలు ఉపయోగపడతాయి అనేదానిపై..... వివిధ రకాలైన వంటకాలు, కేక్స్, ఇలా దాదాపు 24 రకాలైన వంటకాలను తయారుచేసి విద్యార్థులకు పాకశాస్త్ర నిపుణులకు నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సికా కు సంబంధించిన ప్రధాన ప్రతినిధులు చెఫ్ మాస్టర్స్.... యాదగిరి సీతారాం ప్రసాద్ సంజయ్ కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు చెన్నైలో జరిగే అంతర్జాతీయ కలినరీ పోటీలలో ప్రపంచవ్యాప్తంగా 3 వేల మంది పాకశాస్త్ర నిపుణులు పోటీపడుతున్నట్టు నిర్వాహకులు వివరించారు.

# మహిళలలో రాజకీయంగా చైతన్యం కావాలి

హైదరాబాద్ ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహిళలు రాజకీయంగా చైతన్యం తెచ్చుకొని ప్రజాసేవలో ముందంజలో ఉన్నప్పుడే మహిళా సాధికారికత సులభంగా సాధ్యమవుతుందని ప్రముఖ సంఘ సేవకురాలు సామాజికవేత్త లలిత కుమారి తెలిపారు

ఆదివారం తన పుట్టినరోజు పురస్కరించుకొని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ మాతృదేవోభవ సత్సంగ్ అడ్వైజర్ మదన్మోహన్ నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి సత్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సమభాగం ఉన్న మహిళలను కేవలం ఓటును దృష్టిలో పెట్టుకోకుండా రాజకీయ పార్టీలు నిస్వార్థంగా మహిళలను ప్రోత్సహించి రాజకీయాలలో ఉన్నత మహిళలు పొంది మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు

దీనికి స్వచ్ఛంద సేవా సంస్థలు సంఘ సేవకులు కూడా సహకరించి ప్రోత్సహించాలని తెలిపారు

అప్పుడే మహిళలు సుఖశాంతులతో జీవించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు

# భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి -జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని,భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేయాడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

పోలీసు యంత్రాంగం, డి ఆర్ ఎఫ్ బృందం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే,స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని,పోలీస్ వారి సూచనలను పాటిస్తూ సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. ఉదృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ఎ ా గ ౕ ు ల ు , కాలువలు,నదులు,రిజర్వాయర్లు,చెరువుల వద్దకు ఎవరు వెళ్ళరాదన్నారు. జలాశయాలు,చెరువులు,వాగుల,ప్రాజెక్టుల వద్దకు మత్స్యకారులు,ప్రజలు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లకూడదని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి,వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని,వైర్లను గానీ చేతులతో తాకవద్దన్నారు. చెట్ల కింద,పాడైన భవనాలు కింద,శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని, స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్‌డబి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉదృతితో రోడ్లు తెగిపోయినా, ఉదృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్,హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంజరుగుతుందన్నారు. ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని , ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలుతీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుంది. కావున ప్రజలుఅప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణం చేయాలని సూచించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని పేర్కొన్నారు.

# ఆంధ్రా నీటి పంపకాల్లో బిజెపి నష్టం కలిగిస్తోంది

## -కూటమి ప్రభుత్వం నుంచి టిడిపి బయటికి రావాలి అద్దంకి డిమాండ్

హైదరాబాద్ ఆగస్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రా నీటి పంపకాల్లో బిజెపి నష్టం కలిగిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టుల గురించి టిడిపి ఆలోచించడం లేదని అద్దంకి దయాకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం నుంచి టిడిపి బయటికి రావాలని అన్నారు. అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. తమ వాట కోసం.. తాము కొట్లాడితే మీకు వ్యతిరేకం ఎలా అవుతుంది అని ప్రశ్నించారు.

# రాజన్నను దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి వివాహ వార్షికోత్సవం సందర్భంగా కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ స్థానాచార్యులు వారికి ఆశీర్వచనం ఇచ్చారు. వారి వెంట సీనియర్ బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, రేగుల శ్రీకాంత్, నరేష్ తదితరులు ఉన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఏసీ దగ్ధం

అమరావతి, ఆగష్టు 16:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీలో ఘోర ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా ఓ ఇంట్లోని ఏసీ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగి విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి.

ఎనగందుల సతీష్ గౌడ్ అనే వ్యక్తి నివాసంలో జరిగిన ఈ ఘటనలో బట్టలు, మంచం, పరుపులు, ఏసీ పూర్తిగా కాలిపోయాయి. అంతేకాకుండా ఇంట్లో ఉన్న రూ.1 లక్ష నగదుతో కలిపి దాదాపు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా.. కానిస్టేబుల్ ముత్తె శ్రీనివాస్, అగ్నిమాపక లీడింగ్ ఫైర్ మెన్ రవీందర్ రెడ్డి, డీపీఓ ప్రశాంత్, ఫైర్ మాన్ మధుకర్, ఉదయ్ లు ఫైర్ ఇంజిన్ తో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఘటనపై సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎమ్మార్వో గంగరాజులు అక్కడికి చేరుకొని పంచనామ నిర్వహించారు. ప్రమాదానికి సంబంధించిన నష్టాన్ని అధికారులు అంచనా వేశారు.

ఇటీవలి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌లు, ఎలక్ట్రిక్ పరికరాల్లో లోపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా పాత ఇళ్లలో వైర్లు, ప్లగ్ పాయింట్లు బలహీనపడటం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికం.

ఇలాంటి సమయంలో ఎలక్ట్రిక్ పరికరాలను సురక్షితంగా వాడటం, నిరంతరం సర్వీసింగ్ చేయించడం, వర్షపు నీరు ఇంటి లోపలికి చొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. అయితే, ఈ తరహా ప్రమాదాలు మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతాయి.

రోజువారీ కష్టపడి సంపాదించి.. కొన్న వస్తువులు క్షణాల్లో కాలిపోవడం కుటుంబాలను కుదేలయ్యేలా చేస్తుంది. నగదు నష్టం, గృహోపకరణాల నష్టం కలిపి తిరిగి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పడుతుంది. అందుకే ఇంటి ఇన్సూరెన్స్, ఎలక్ట్రికల్ సేఫ్టీ చెకప్‌లు వంటి చర్యలు తీసుకోవడం ద్వారా ఈ విధమైన అనుకోని ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చు.

విద్యుత్ పరికరాలను వాడేటప్పుడు నిర్లక్ష్యం ప్రాణాపాయం కలిగించవచ్చు. ప్రతి ఇంట్లో సర్క్యూట్ బ్రేకర్ (ఓఅః), ఫ్యూజ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చిన్న చిన్న జాగ్రత్తలు మన ఆస్తులను, ప్రాణాలను కాపాడగలవు

# ఇందిరా మహిళ శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు-ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ, ఆగస్ట్ 16:ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఇందిరా మహిళా కింద వేములవాడ రూరల్ మండలం బొల్లారంలో శ్రీ శివరామ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు ఢ విత్తనాలు దుకాణాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. మహిళలు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించరు.రైతులు ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శరత్ కుమార్‌కి ఉత్తమ ప్రిన్సిపాల్ ప్రశంసా పత్రం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగినటువంటి స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెరకు శరత్ కుమార్ ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల డీఐఈఓ శ్రీనివాస్, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శేఖర్, అంజయ్య, దేవయ్య, రవీందర్, మహేందర్, జై భారత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, గోపి, సంతోష్, అశోక్, వెంకటేశ్వర్లు, నరసింహమూర్తి మహిళా అధ్యాపకులు స్వప్న, అరుణ, లతా, మంగ, జ్యోతి మరియు కార్యాలయ సిబ్బంది సంధ్య, రాజు, లక్ష్మి తదితరులు అభినందించారు.

# మావోయిస్టు పార్టీ పై నిషేధాన్ని ఎత్తి వేసి వారితో శాంతి చర్చలు జరపాలి

## -సిపిఐ ( ఎమ్ ఎల్) చంద్ర పుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్



హైదరాబాద్ ఆగష్టు 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మావోయిస్టు పార్టీ పై నిషేధాన్ని ఎత్తి వేసి వారితో శాంతి చర్చలు జరపాలని సిపిఐ ( ఎమ్ ఎల్) చంద్ర పుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేసారు. శనివారం హైదరాబాద్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో ప్రభాకర్ మాట్లాడుతూ భూమి,భుక్తి, పీడిత ప్రజల విముక్తి,కోసం గత 50 సంవత్సరాలుగా దళిత, ఆదివాసీ, పీడిత ప్రజల పక్షాన,ఈ దళారి దోపిడి వర్గాలకు వే తీరకంగా పోరాడుతూ వేలాది మంది పీడిత ప్రజలు అమరవీరును పోలీసు లు కాల్చి చంపారు.ఎమర్జెన్సీ నుండి ఇప్పటి వరకు హక్కుల సంఘం ,కార్యకర్తలను, నక్సల్స్ పేర్లమీద బూటకపు ఎన్కౌంటర్ పేర్లతో చంపుతూనే ఉన్నారు దేశ రాజకీయాలను,పెట్టుబడి దార్లు ఆయన టాటా, బిర్లా, అంబానీ, అదానీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు దండకారణ్యంలో ఉన్న అపారమైన నిధి, నిక్షేపాలు, ముడిసరుకు దోసుకెళ్లేం దుకే దండకారణ్యం పూర్తిగా పోలీస్ క్యాంపులును నిండి ఉన్నాయి ,అమాయక ఆదివాసీలను పోలీస్ క్యాంపులో ఉంచుతూ వారిని మాన సికంగా,శారీరకంగా హింసిస్తున్నా రు,ప్రతి బూతకకపు ఎన్కౌంటర్ లో వందలవంది నీ చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మారణ హోమానికి అంతం పలికాలనిమావోయిస్టు పార్టీ నిషేధాన్ని ఎత్తివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని, ఆపరేషన్ కగర్ ను నిలిపి వెయ్యాలని,ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్ లను నిలిపి వెయ్యాలిఆదివాసీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మిలిటరీ, పోలీసు క్యాంపుల ను వెంటనే ఎత్తి వెయ్యాలనిఆపరేషన్ కగర్ పేరుతో జరిగిన సామూహిక హత్యలు, అత్యాచారాలపై న్యాయవిచారణ మాజీ సిట్టింగ్ జడ్జి తో న్యాయ విచారణ జరిపి బాధ్యులపై పోలీస్,మిలిటరీ అధికారుల పై చర్యలు తీసుకోవాలని సీపీఐ( యం ఎల్) చ నీ ద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కేంద్ర, రాష్ట్ర,ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు,సుధాకర్, షేక్ షావలి,సంపంగి పదమ్మక్క, సునీత,సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# మెట్‌పల్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కరీంనగర్, ఆగష్టు 16: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మురళీకృష్ణ మందిరంలో ఆలయ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి దంపతుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉ త్ స వ వ ం ా ూ ్ త ల క ్ ం పంచామృతాభిషేకాలు, విశేష లక్ష పుష్పార్చన సామూహిక ప్రత్యేక పూజలు వేద పండితుల మంత్రోత్సవాల మధ్య నిర్వహించారు.

అనంతర భక్తులు నగర సంకీర్తన, పల్లకి సేవ, భజన సంకీర్తనలతో పాటు ఉట్టి కొట్టడం తదితర కార్యక్రమాలను చేపట్టారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడు మైలారపు రాంబాబు, కమిటీ సభ్యులు, సంకీర్తన భజన మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని వాజ్ పేయి వర్ధంతి -బీజేపీ శ్రేణుల ఘన నివాళి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో శనివారం భారత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్పేయి వర్ధంతిని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్అధ్వర్యంలో వాజ్ పెయి చిత్ర పటంకు ఘన నివాళులు అర్పించారు.

అనంతరం రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ రెండు ఎంపీల తోటి జైత్రయాత్రను ముందుండినడిపిన మహనీయుడు అని కొనియాడారు.

400 సీట్ల జైత్ర యాత్రలో కొనసాగడానికి బాటలు వేసిన మహనీయుడు అని, తెలియజేశారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ అఖండ భారతం నేడు అన్ని దేశాలతో పోటీపడుతూ మోడీ నేతృత్వంలో ముందుకు పోవడానికి ఎంతో కృషి చేసిన మహనీయుడు, గొప్ప రాజకీయవేత్త అటల్ బీహార్ వాజ్పేయి అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రేగుల మల్లికార్జున్, వాసు, మల్లేశం యాదవ్, బచ్చు వంశీ, రేగుల శ్రీకాంత్, బిల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు పరిసర ప్రాంతాల్లో పటిష్ట గస్తీ : సీఐ ముష్కరాజ్

ఖమ్మం రూరల్, ఆగస్టు 16 : ఎగువన కురిసిన భారీ వర్షాలకు మున్నేరు వాగులో వరద ప్రభావం పెరిగినందున పరిసర ప్రాంతాల్లో పటిష్ట గస్తీ ఏర్పాటు చేసినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్కరాజ్ తెలిపారు. శనివారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీ ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని మున్నేరు పరిసర ప్రాంతాలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు.

కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మున్నేరు సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి, ప్రజలెవరూ అటువైపు రాకుండా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

వరద తీవ్రత మరింత పెరిగితే ఆయా ప్రదేశాల్లో భారీకేడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనంకు ఆహ్వానం

హైదరాబాద్, ఆగష్టు 16: సెప్టెంబర్ 14 ఉదయం9-30గం.కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనం టి.జి.సభ కళా సుబ్బారావు కళా వేదికపై నిర్వహించబడుతుంది.వచన కవితా రచన పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు గౌరవ అతిథులచే బహుమతి ప్రదానం జరుగుతుంది .35సం.ల లోపు వయసున్న కవులు, కవయిత్రులు కవి సమ్మేళనం లో పాల్గొనడానికి 9704177270 నెంబర్ కు ఫోన్ చేసి సెప్టెంబర్ 2వతేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవలసిందిగా చిమ్మపూడి ఫౌండేషన్ విజ్ఞప్తి చేస్తోంది.

# కరాటే విద్యార్థులకు కాంగ్రెస్ నేత మైలారపు రాము స్వీట్ల పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 16:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సీనారే కళా మందిరంలో మాస్టర్ ఎంఏ మన్నన్ అధ్వర్యంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకుశనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కాంగ్రెస్ నేత మైలారపు రాము స్వీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైలారపు రాముమాట్లాడుతూ విద్యార్థులకు శ్రీ కృష్ణాష్టమి ప్రాముఖ్యత చాటి చెప్పారు. విద్యార్థులు శ్రీ కృష్ణుడు చూపిన బాటలో నడపాలని తెలిపారు. కరాటేలో విద్యార్థులు రాణించాలని సూచించారు. అనంతరం శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాస్టర్ ఎంఏ మన్నాన్ మాట్లాడుతూ ప్రతీ ఏటా కాంగ్రెస్ నేత మైలారపు రాము కరాటే కార్యక్రమాలకు తన వంతు ఆర్థిక సాయం అందిస్తూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ఇట్టి కార్యక్రమం చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com